www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శనివారం । 25 । ఏప్రిల్ । 2026





## 'శంకర్ గౌడ్' కుటుంబానికి
# సర్కార్ అండ

- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆ ఇంట్లోనే ఒకరికి ఆర్టీసీ ఉద్యోగం
- మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే దొంతి
- సొంత నిధుల నుంచి రూ.5 లక్షల సాయం



**నర్సంపేట, అక్షిత ప్రతినిధి :** నర్సంపేటలో జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసనలో భాగంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన ముత్తోజిపేట గ్రామ నివాసి, డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భారీ ఊరట నిచ్చారు. సమ్మె సెగల మధ్య జరిగిన ఈ విషాద ఘటనతో నియోజకవర్గం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురవ్వగా, ఆ నిరుపేద కుటుంబం రోడ్డున పడకుండా యంత్రాంగం మెరుపు వేగంతో స్పందించింది. మరణవార్త తెలిసిన వెంటనే నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి ముత్తోజిపేటకు చేరుకుని శంకర్ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం తరపున రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను

మిగతా.. 2లో



## యువత వికసిత్
# భారత్‌కు పునాది


- యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**మహబూబ్‌నగర్, అక్షిత ప్రతినిధి:** యువతే బలమైన, ప్రగతిశీల దేశ నిర్మాణానికి నిజమైన శక్తి అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం ద్వారా బలమైన భారతదేశ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియం గ్రౌండ్స్‌లో పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన "ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్-2026" బహుమతి పంపిణీ కార్యక్రమంకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, టీమ్ స్ఫూర్తినీ పెంపొందించడానికి, ఓర్పు , క్రమ శిక్షణను అభివృద్ధి చేయడానికి కీలకమని పేర్కొన్నారు. యువతలో ఉన్న ఉత్సాహం, పట్టుదల దేశ అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల

మిగతా.. 2లో



## అనుమతి లేకుండా
# ఇసుక తవ్వొద్దు

- కలెక్టర్ చంద్రశేఖర్

**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** జిల్లాలో అక్రమ ఇసుక, చెరువుల మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ సంయుక్తంగా ఆర్డీఓలు తహసిల్దారులు డీఎస్పీలు ఎంపీడీవోలు, ఎస్ఎం-వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

జిల్లాలో ఎక్కడైనా పర్మిషన్ లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే సంబంధిత వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. చెరువుల నుండి మట్టి తీస్తే కూడా అనుమతి లేకుండా చేస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అవసరాల కోసం మట్టి

మిగతా.. 2లో

## రక్షించేది కాదు
# భక్షించే సర్కార్

- డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్య
- శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి
- ఆలేరు వద్ద అరెస్ట్ వలిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

**వలిగొండ /అక్షిత న్యూస్:** ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్స్‌ను నెరవేర్చడానికి చేస్తున్న సమ్మెలో భాగంగా నిన్న వరంగల్ జిల్లా నర్సంపేటలో శంకర్ గౌడ్ అనే డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకి పాల్పడడం జరిగింది.

మిగతా.. 2లో



## అనుమతి లేకుండా ఇసుక తవ్వొద్దు

మొదటి పేజీ తరువాయి..

తీసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన మేరకు ఇసుకను లీగల్‌గా అందుబాటులో ఉంచాలని, కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అనేశ్వరం గుట్ట చెరువు, కనగల్లు తిమ్మన్నగూడెం చెరువుల వద్ద అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం,రవాణాతో అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే వేములపల్లి మండలం బొమ్మకల్లు, రావులపెంట ప్రాంతాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. దేవరకొండ లో కూడా ఇసుక రీచ్ అవసరాన్ని పరిశీలించి ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ

అక్రమ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా లేదా మట్టి తవ్వకాలు కనిపిస్తే వెంటనే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సంబంధిత వాహనాలను సీజ్ చేసి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లీగల్ విధానాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రెండు మూడు రోజుల్లో జిల్లాలో పూర్తిగా అక్రమ తవ్వకాలను నియంత్రించేలా పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

జిల్లా అభివృద్ధి, ప్రజల అవసరాల దృష్ట్యా ఇసుక సరఫరా పూర్తిగా చట్టబద్ధంగా జరగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్‌లో రెవిన్యూ అదనపుకలెక్టర్ జె శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. మైనింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు

## 'శంకర్ గౌడ్' కుటుంబానికి సర్కార్ అండ

మొదటి పేజీ తరువాయి..

తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ ఇంటికి శాశ్వత జీవనోపాధి కల్పించేలా ఒకరికి టీఎస్ఆర్టీసీలో ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియను అతి త్వరలోనే పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

మరోవైపు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ప్రభుత్వం అందించే సహాయానికి అదనంగా, తన వ్యక్తిగత నిధుల నుండి రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. శంకర్ గౌడ్ నియోజకవర్గ బిడ్డ అని, ఆ కుటుంబానికి భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తాను పెద్దన్నలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నిరసనల సెగలో ఒక నిరుపేద కార్మికుడు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, రాజకీయాలకు అతీతంగా

ఆ కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. కష్టకాలంలో కన్నీరు తుడిచేందుకు యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధి పోటీపడి ముందుకు రావడం, ముఖ్యంగా ఉద్యోగ భరోసా కల్పించడంపై ముత్తోజిపేట గ్రామస్తులతో పాటు కార్మిక లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

## జగిత్యాల పట్టణ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ విజేతలకు సన్మానం

జగిత్యాల అక్షితబ్యూరో:

జగిత్యాల మున్సిపాలిటీలో జరిగిన కో–ఆప్షన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులను మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన కో–ఆప్షన్




సభ్యులు వీరబత్తిని పద్మజ, గట్టు సతీష్, అబ్దుల్ ఖాదర్ ముజ్జహిధా (బుజ్జి) గారిని అభినందిస్తూ, వారి భవిష్యత్ సేవలు ప్రజలకు ఉపయోగ పడాలని ఆకాంక్షించారు.

మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా వారిని కోరారు.

# రక్షించేది కాదు భక్షించే సర్కార్

మొదటి పేజీ తరువాయి..

మరణించిన శంకర్ గౌడ్ మృతదేహాన్ని సందర్శించడానికి వెళ్తున్న మాజీ శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారిని ఆలేరు పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టు చేసి వలిగొండ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మధుసూదనా చారి మాట్లాడుతూ శంకర్ గౌడ్ మృతదేహాన్ని పరామర్శించడానికి బండి సంజయ్ కు మాత్రం పర్మిషన్ ఇచ్చి మమ్మల్ని అరెస్టు చేయడం చాలా అక్రమమని వారన్నారు. అంతేకాకుండా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పబ్బం కడుపుకుంటున్నారని, రేవంత్ నిర్వహించిన ప్రతి సమావేశంలో కేసీఆర్ పేరు లేకుండా ఆయన మాట్లాడలేకపోతున్నాడు. రేవంత్ ది రక్షించే ప్రభుత్వం కాదు భక్షించే ప్రభుత్వమని ఆయన తెలియజేశారు. ఆర్గ్గారంట్ ఇలా అమలులో భాగంగా మొదటిదైన ఫ్రీ బస్ సక్రమంగా అమలు చేస్తున్నామని ప్రగల్బాలు పలుకుతూ 3000 కోట్లు ఆర్టీసీకి బకాయిలు ఎలా పెడతారని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలను అరిగోశలు పెడుతున్న ప్రభుత్వాన్ని చూసారా అంటే దానికి ఉదాహరణ రేవంత్ రెడ్డి



ప్రభుత్వం మాత్రమే. ఒక్కసారి అవకాశం ఇవ్వమన్న మాట ప్రజల జీవితాలను ఆగం చేసిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మద్దెల మంజుల, మహమ్మద్ అఫ్రోజ్, పల్సం రాజు తదితరులు పాల్గొన్నారు.

# యువత వికసిత్ భారత్‌కు పునాది

మొదటి పేజీ తరువాయి..

ప్రతిభను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ తరహా క్రీడా ఉత్సవాలు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.

ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలు క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రతిభను గుర్తించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతలో క్రీడలు కేవలం పతకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మవిశ్వాసానికి, జాతీయ ఐక్యతకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి బాలబాలికకు క్రీడల్లో రాణించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.యోగా, యుద్ధ కళలు వంటి భారతీయ సంప్రదాయాలు








శరీరం, మనస్సు,ఆత్మల సమతుల్యతను పెంపొందించి శ్రేష్ఠత సాధనకు దోహదపడతాయని గవర్నర్ తెలిపారు. జాతీయ విద్యా విధానం-2020లో క్రీడలను ప్రధాన స్రవంతి విద్యలో భాగం చేయడం ద్వారా భవిష్యత్ విజేతలను తీర్చిదిద్దే దిశగా ముందడుగు పడిందన్నారు.

విజేతలందరికీ అభినందనలు తెలిపిన గవర్నర్, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, యువ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభను ప్రోత్సహిస్తూ, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ బలమైన, ఐక్య భారతదేశ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### ఎంపీ డికె అరుణ మాట్లాడుతూ

గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ దోహదం చేస్తుంది. క్రీడలు దేశ యువత ను మోటివేట్ చేస్తూ సరైన దిశలో నడిపిస్తాయి. పీఎం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మోదీ గారి చొరవ తో ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో

దేశం ముందంజలో నిలుస్తుంది. ఖేల్ ఇండియా ద్వారా గ్రామీణా ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు.

మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలో

ఈ క్రీడలు ఈనెల 9 నుంచి 15 వరకు మండల స్థాయిలో, 15 నుంచి 20 వరకు అసెంబ్లీ స్థాయిలో, 21, 22 తేదీల్లో పార్లమెంటరీ స్థాయిలో నిర్వహించారు.

మహబూబ్‌నగర్ నగర్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజల తరపున, నగర ప్రజల తరపున గవర్నర్ కి హృదయపూర్వక స్వాగతం మరియు కృతజ్ఞతలు తెలిపారు. అనేక కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ప్రేరణనివ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు గవర్నర్ కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మహోత్సవం ద్వారా విద్యార్థుల్లో టీంవర్క్, క్రమశిక్షణ, సామాజిక చైతన్యం వంటి విలువలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. దేశంలో క్రీడల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలుపుతూ, ఒలింపిక్స్‌లో భారత్ అత్యధిక పతకాలు సాధించే లక్ష్యంతో పలు ప్రణాళికలు అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడు కాబట్టి రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి క్రీడలో ప్రాతినిధ్యం వహించడమే కాదు, ఒలింపిక్ లాంటి క్రీడలో పాల్గొని పతకాలు దేశానికి అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపన వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ క్రీడలను ప్రోత్సహిస్తే యువతలో మంచి మార్పు వస్తుందని అన్నారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ మహోత్సవం వేలాది మంది క్రీడాకారుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన కార్యక్రమమని తెలిపారు. పాఠశాలలు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా దృష్టి పెట్టాలని, పిల్లల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలను పెంపొందించాలని సూచించారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు, మీడియా ప్రతినిధులు మరియు ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా నగర మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు,ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పార్లమెంట్ ఇంచార్జి జనార్ధన్ రెడ్డి, అంతర్జాతీయ మహిళా క్రికెటర్లు దయానా డేవిడ్, గోంగిడి త్రిష రెడ్డి, మహిళల ప్రీమియర్ లీగ్ క్రికెటర్ త్రిష పూజిత, ఇతర ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్--2026 బహుమతుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ కు వచ్చిన రాష్ట్ర గవర్నర్ కు ఎంపీ డికె అరుణ,జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి జానకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# ఆర్.టి.సి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి

## మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కోలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో శుక్రవారం ఆర్టీసీ జేఏసి కార్మికులకు మద్దతుగా మేయర్ కోలగాని శ్రీనివాస్ డిపో వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్





నుండి అమరవీరుల స్థూపం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. పీఆర్సీ ప్రకటించి, 2021 వేతన సవరణలను 30% ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్టీసీ జేఏసి ఉంచిన 32 డిమాండ్లపై చర్చలు జరిపి, 39 వేల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కొత్త బస్సుల కొనుగోలు, రిక్రూట్‌మెంట్ చేపట్టి, అద్దె బస్సులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయండి

## -ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్

**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్, ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు లు మాట్లాడుతూ. మూడు రోజుల నుంచి మండుటెండలో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు అందరికీ విప్లవి వందనాలు తెలియజేస్తూ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య పట్ల విచారణ వ్యక్తం చేశారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డిమాండ్లను నెరవేర్చుకుందామని సూచించారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల డిమాండ్లన్నింటిని ఒప్పుకోవాలని తద్వారా సమ్మెకు ముగింపు పలకాలని సూచించారు. అదేవిధంగా మహేశ్వరం డిపో సమ్మె చేస్తున్న కార్మికులకు తక్షణం టెంటు వేసుకుని





అనుమతిని పోలీస్ శాఖ ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని వారికి అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకత్వం అధికారులకు కోరడం జరిగింది. ఎండలో సమ్మె చేస్తున్న కార్మికులు అస్తవ్యస్తకు గురైన ఐలయ్య దేశలను ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం వెంటనే కార్మికుల నాయకులతో చర్చలు జరిపి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొమగల రాజు, దేవేంద్ర గౌడ్, గణేష్, పెయింటిష్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.





# డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యే

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు

## బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దెపాగ మణి కుమార్

**గద్వాల అక్షిత న్యూస్:** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని.. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దెపాగ మణికుమార్ డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నందు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన పార్టీ నాయకులతో కలిసి శు క్రవారం సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులు ఏర్పాటు చేసిన డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న న్యాయమైన 32 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వము కాలయాపన చేయడంతోనే దిగ్భ్రాంతికి గురైన డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని పట్టించుకుని మృతి చెందడం బాధాకరమన్నారు. శంకర్ గౌడ్ మృతి ఆర్టీసీకి తీరని లోటు అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. శంకర్ గౌడ్ కుటుంబాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. ఈనెల 29వ తేదీన ఆర్టీసీ డిపోల ముందు కార్మికులు చేసే అర్థనగ్న ప్రదర్శనలకు కూడా బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు ఇస్తుందని మరియు పాల్గొంటుందన్నారు. అదేవిధంగా ఈనెల 28వ తేదీన మహిళా కార్మికులు చేసే బతుకమ్మ కార్యక్రమంలో కూడా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్మికులకు మద్దతుగా పాల్గొంటారని సందర్భంగా ఆయన సూచించారు. మౌన ప్రదర్శనలు, వంటావార్పు, కార్మికుల కవాతు లాంటి కార్యక్రమాలలో పార్టీ కార్యకర్తలు పాల్గొంటారని ఆయన చెప్పారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో డ్రైవర్ రవీందర్ ఆత్మహత్యాయత్నంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వము ఆర్టీసీ కార్మికులతో చర్చించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శాంతి రాజు, ఇటిక్యాల మండల అధ్యక్షుడు జీవన్ ఇతరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి క్రికెట్ టీంకు సెలెక్ట్ అయిన విద్యార్థిని గౌతమికి ఘన సన్మానం

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన ఈర్లపల్లి అరుణ విజయ్ కుమార్ దంపతుల కుమార్తె గౌతమి అండర్ 15 మధ్యప్రదేశ్ గ్వాలియర్, అండర్ 19 చండీగఢ్, తెలంగాణ ఖమ్మం జిల్లాలో రాష్ట్రీయ స్థాయి క్రికెట్లో రాణించింది. ఈ మేరకు జాతీయస్థాయి క్రికెట్ టీం సెలెక్ట్ కావడం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శుక్రవారం ఆయన నివాసంలో గౌతమిను శాలువాతో సత్కరించి తన వంతు సహాయంగా పారితోషకం అందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు.



# క్రమశిక్షణ, పట్టుదల, ఆకాంక్షతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధ్యమే

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** మహబూబ్ నగరంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ మరియు డా. ఏ.పీ.జె. అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ సమ్మర్ సైన్స్ క్యాంపు ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన 100 మంది విద్యార్థులతో 12 రోజులపాటు రెసిడెన్షియల్ విధానంలో ఈ సైన్స్ క్యాంపు కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్ క్యాంపులు ఎంతో అవసరమని తెలిపారు. మహబూబ్ నగరం భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని, ఇక్కడి నుంచి అనేక మంది శాస్త్రవేత్తలు వెలువడాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఆకాంక్షతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధ్యమని ఆయన పేర్కొన్నారు. "ఎందుకు? ఏమిటి? ఎలా?" అనే ప్రశ్నలతో ఆలోచించే వారే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు పరస్పరం ఆలోచనలు పంచుకుంటూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. మంచి మార్కులతో ఐఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ, మార్కులతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవడం కూడా ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ప్రతి పాఠశాలలో ఆధునాతన లైబ్రరీలు ఉండాలని, ప్రతి ఇంట్లో దినపత్రిక చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. దినపత్రికల ద్వారా ప్రపంచ పరిణామాలపై అవగాహన పెరిగి విజ్ఞానం విస్తరిస్తుందని తెలిపారు. ఈ సైన్స్ క్యాంపు ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందడమే కాకుండా, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.





భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగానికి పునాది వేయడంలో ఈ క్యాంపు ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకట్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ అధ్యక్షులు జనార్దన్, కర్ణాకర్ గౌడ్, మల్లప్ప, ఆంజనేయులు, అనురాధ తదితరులు పాల్గొన్నారు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# దామెరలో ఎడ్ల పందాల సందడి

**- ఎడ్ల దూకుడు ప్రేక్షకుల కేరింతలు దామెరలో పందాల హంగామా**

**- ఎడ్ల పందాల విజేతలకు బహుమతుల వర్షం**

**- నగదు బహుమతి అందజేసిన మాజీ సర్పంచ్ యాదగిరి**







**నాంపల్లి, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని దామెర గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా మొట్టమొదటిసా

సంప్రదాయ క్రీడలకు ప్రతీకగా నిలిచే ఎడ్ల పందాల పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు యువత భారీగా హాజరై పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే ప్రారంభమైన పోటీలు రాత్రి 11 గంటల వరకు ఉత్సాహభరితంగా కొనసాగాయి.

ఈ పోటీల్లో పలువురు పోటీదారులు తమ ఎడ్లతో వేగం, శక్తి, సమన్వయాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకులను అలరించారు. ప్రతి రౌండ్‌లో కఠినమైన పోటీ నెలకొనగా విజేతలను నిర్ణయించేందుకు నిర్వాహకులు ప్రత్యేక జడ్జింగ్ విధానాన్ని అమలు చేశారు.

విజేతలకు మొదటి బహుమతిగా దామెర గ్రామ మాజీ దామెర యాదగిరి బ్రదర్స్ (రూ.20. 116/-) లో నగదు దామెర యాదగిరి వెంకన్న కడారి పెద్దలు యాదవ్ బచ్చనబోయిన శంకర్ యాదవ్ చేతుల మీదుగా నగదు బహుమతులు విజేత పిల్లి వెంకన్న అందుగుల వారికి అందిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయ క్రీడలను పరిరక్షించడం ఎంతో అవసరమని యువత ఈ తరహా పోటీల్లో పాల్గొనడం ద్వారా సంస్కృతి నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా ప్రేక్షకుల మంచినీటి సౌకర్య అర్ధం కీర్తి ఎలక్ట్రానిక్ యాజమాన్యం బచ్చనబోయిన శంకర్ యాదవ్ వారు సహకరించారు. అదేవిధంగా రెండో బహుమతి (రూ.15116/-) లు విజేత కాలువ పెల్లి గ్రామం మండల శ్రీను కు కట్ల మాణిక్య రెడ్డి సుగ్రీవ రెడ్డి, మూడవ బహుమతి (రూ.10.116/-): మన్యం నాయక్ గాజు తండ వారికి చత్రపతి శివాజీ సేన దామెర వారు అందజేశారు. నాలుగవ బహుమతి రూ.7116/-): విజేత ముత్యాల శంకర్ (వెంకటాపురం) వారికి అందజేశారు. వారికి కాటబోయిన శంకర్ యాదవ్ ఉప సర్పంచ్ అందజేశారు.

ఈ పోటీల నిర్వహణలో గ్రామ యువకులు బచ్చనబోయిన రవీందర్ యాదవ్, బలుసుల జగన్ యాదవ్, బుషిపాక నరసింహ, బచ్చనబోయిన రాజు యాదవ్, మండల గిరి యాదవ్, కీలక పాత్ర పోషించారు.

భద్రతా ఏర్పాట్లు, ప్రేక్షకుల సౌకర్యాలు, పోటీ నిర్వహణలో వారు చూపిన కృషిని గ్రామ పెద్దలు ప్రశంసించారు.



## ఆడబిడ్డ ఉన్నత చదువులకై ఆర్థిక సహాయం అందించిన తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** వెల్దండ మండలం పొతేపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య కుమార్తెకు పై చదువుల కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి.10,000/-వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితాన్ని మారుస్తుందన్నారు.



ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యను ఆప కూడదని, ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద,మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి స్థానాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. సమాజం లోని దాతలు కూడా ముందుకు వచ్చి విద్యార్థులకు సహకరించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా మాత్రమే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

వెంకటయ్య కుమార్తె చదువులో మెరుగైన ఫలితాలు సాధించి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ సహాయం ఆమె విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ కల్వకుర్తి మండల నాయకులు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు...

## కల్లు గీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేసిన ఎంఎల్ఏ సంజయ్ కుమార్

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణంలో గొల్లపల్లి రోడ్డు మోతె ఎల్లమ్మ ఆలయం గౌడ సంఘం దగ్గర జిల్లా వెనుకబడిన



తరగతుల సంక్షేమ శాఖ,జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణానికి చెందిన కల్లుగీత కార్మికులకు 100శాతం సబ్సిడీతో కాటమయ్య రక్షణ కిట్ల ను పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమం లో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సునీత, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మాజీ లైబ్రరీ ఛైర్మెన్



డా.చంద్ర శేఖర్ గౌడ్, సర్పంచ్ మహేష్, సిఐ సర్వేశ్వర రావ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్, గౌడ సంఘం సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

**పార్టీలకు అతీతంగా,దళారీల వ్యవస్థ లేకుండా పథకాల అమలు..**

**ఈ నెల చివరిలో క్యాంపు కార్యాలయం వేదికగా ఇందిరమ్మ ఇళ్లపై గ్రీవెన్స్...**

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత న్యూస్:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 256 మంది నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ,నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి అర్హులకు మంజూరు పత్రాలను అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 2000 మంది లబ్ధిదారులకు రూ.20.80 కోట్లు విడుదల చేసినట్లు, ఇంకా రూ.42.03 కోట్లు మంజూరు కావాల్సి ఉన్నట్లు చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటి స్థలం లేని నిరుపేదల కోసం జి ప్లస్ త్రీ విధానంలో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయిం చిందని, ప్రభుత్వ భూములను గుర్తించి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న బాలసముద్రంలో గ్రీవెన్స్ నిర్వహించి లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న కార్పొరేటర్లు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఘనంగా ఈషా గౌతమి

## స్కూల్స్ వార్షికోత్సవం

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణంలోని ఈషా, గౌతమ స్కూళ్ల వార్షికోత్సవ వేడుకలు "ఈషా ఎక్స్టసీ" పేరుతో జగిత్యాల ధర్మపురి రోడ్డులోని సుమంగళి గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, సాధనలకు వేదికగా నిలిచింది.

విద్యార్థుల నృత్యాలు, నాటికలు, సంగీత ప్రదర్శనలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, అతిథులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఈషా గౌతమి పాఠశాల లకు చైర్మన్ కంది కైలాసం మాట్లాడుతూ.. విద్యార్థుల లో ఉన్న ప్రతిభను వెలికి తీయడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని అన్నారు. పాఠశాలలు









కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తదుపరి కరెస్పాండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉందని, ఇలాంటి వేదికలు ఆ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాన్ని కల్పిస్తాయని చెప్పారు. తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల ఎదుగుదలలో కీలకమని ఆమె పేర్కొన్నారు. డైరెక్టర్ నాగమణి మాట్లాడుతూ, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమాల ముఖ్య లక్ష్యమని తెలిపారు. పిల్లలు చదువుతో పాటు కళలు, క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి పాఠశాల యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## మోకాళ్ళ శాస్త్ర చికిత్స కోసం ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన పబ్బాల జంగయ్య కు మోకాళ్ళ శాస్త్ర చికిత్స కోసం ప్రభుత్వం



ద్వారా మంజూరైన లక్ష 50వేల ఎల్ఓసిని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి శుక్రవారం జంగయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు పడకంటి వెంకటేష్ పాల్గొన్నారు

## సూర్య గ్లోబల్ స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ పాఠశాలలో “కలోత్సవ్ 2K26 పేరుతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ, దేశభక్తి నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నరసింహ అవతారం, శివతాండవం, దాండియా నృత్యం, అమ్మ-నాన్న గొప్పతనాన్ని ప్రతిబింబించే నృత్యం, ఆర్మీ థీమ్‌తో చేసిన






ప్రదర్శనలు, అలాగే విభిన్న పాత్రలతో కూడిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ, చిన్నారులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, హ్యాండ్‌రైటింగ్ స్కిల్స్, స్పీకింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని చెప్పారు. ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థులలో సాంస్కృతిక విలువలను పెంపొం దించడం పాఠశాల లక్ష్యమని వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాల విజయవంతానికి విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన సహకారం మరువలేనిది అంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ జోగినిపల్లి రమాదేవి, డైరెక్టర్లు హరి చరణ్ రావు, మౌనిక రావు, రజిత, హరిచరణ్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందొద్దు

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల ఆందోళనపై మంత్రి జూపల్లి ఆరా.. సంయమనం పాటించాలని విజ్ఞప్తి.. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సమ్మెను విరమింపజేసేలా ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతోంది. తొందరపాటు చర్యలు వద్దు . ప్రతిపక్షాల మాయలో పడొద్దు. గతంలో ఆర్టీసీ కార్మికుల ఆందోళనను ఉక్కుపాదంతో అణిచివేసిన చరిత్ర గత ప్రభుత్వానిది. 55 రోజుల సమ్మె జరిగిన అనాడు స్పందించలేదు. 36 మంది ఆర్టీసీ కార్మికులు మరణించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చలించలేదు. సమ్మె అంటే డిస్మిస్ అని నాటి పాలకులు హెచ్చరించారు. ప్రతిపక్షాలు ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టడం మానుకోవాలి.

## పాలమూరు గడ్డ నుంచి మరో ప్రజా పోరాటానికి శంఖారావం పూరిస్తున్నాం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** మహబూబ్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలమూరు గడ్డ నుంచి మరో ప్రజా పోరాటానికి శంఖారావం పూరిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు డీలిమిటేషన్ బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ బిల్లులను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ బిల్లుల వల్ల దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్ వంటి ప్రాంతాలకు నష్టం జరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఈ బిల్లును అడ్డుకున్నాయని తెలిపారు. 2023లో మహిళా బిల్లు ఆమోదం పొందినప్పటికీ, దాని అమలును 2034కు వాయిదా వేయడం సరైంది కాదని, వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మరియు మిత్రపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ లాభం కోసం ఈ బిల్లులను తీసుకువచ్చారని విమర్శిస్తూ, మహిళల ఓట్లు దక్కించుకోవడమే కేంద్ర లక్ష్యమని ఆరోపించారు. ఈ బిల్లు ఆమోదమైతే దేశ ఐక్యతకు ప్రమాదమని హెచ్చరించారు. దక్షిణాది మరియు ఈశాన్య రాష్ట్రాల మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అనంతరం “జనాభాకు అనుగుణంగా రాజకీయ వాటా” అనే సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కులగణన ద్వారా చట్టబద్ధంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ జరిగితే బీసీల రిజర్వేషన్లు దశాబ్దాల పాటు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మహిళా బిల్లు ప్రస్తుత పార్లమెంట్ సీట్లలోనే 33 శాతం రిజర్వేషన్‌తో వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేస్తుందని అన్నారు.

బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిస్తూ, సోషల్ మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో మహబూబ్ నగర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని తెలంగాణ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. దక్షిణ భారత రాష్ట్రాల హక్కులను







కాపాడేందుకు, డీలిమిటేషన్‌లో న్యాయం జరిగేలా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

“42 శాతం బీసీ రిజర్వేషన్లు” ప్రధాన నినాదంగా ప్రకటిస్తూ, సామాజిక న్యాయం సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం , మహబూబ్ నగర్ నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్,, పాశం యాదగిరి, జాన్ వెస్లీ, శారదాగౌడ్, కిల్లె గోపాల్, రఫీ, కార్పోరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత ఉపాధి అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్.**

**మహబూబ్ నగర్ అక్షిత ప్రతినిధి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ‘నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్’ ద్వారా నిర్వహించిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, మైనారిటీ, వెనుకబడిన తరగతుల యువతకు ప్రభుత్వం ‘నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్’ ద్వారా మూడు నెలల పాటు ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందిస్తుందని అన్నారు.

నిరుద్యోగ యువతి యువకులు గృహ నిర్మాణం, ఎలక్ట్రికల్ వైరింగ్, ప్లంబింగ్, వెల్డింగ్, టైలరింగ్, భూమి సర్వే, లాంటి వివిధ ట్రేడ్లలో ఉచిత నైపుణ్య శిక్షణను పొంది స్వయం ఉపాధి అవకాశాలనే కాకుండా, వివిధ కంపెనీలలో మంచి ఉపాధి అవకాశాలను కూడా పొందవచ్చని అన్నారు.

ఈ నైపుణ్య అభివృద్ధి శిక్షణ ప్రవేశాల కొరకు ప్రతి సంవత్సరం, జిల్లా యస్.సి, యస్.టి, బి.సి, మైనారిటీ సంక్షేమ శాఖల వారు పత్రికల ద్వారా నోటిఫికేషన్ విడుదల చేస్తారని, దానికి అనుగుణంగా అర్హులైన నిరుద్యోగ యువతి యువకులు ఉచిత నైపుణ్య శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలని, ‘నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ‘ సహాయ సంచాలకులు శివ శంకర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 లో జిల్లాలో 800 మంది నిరుద్యోగ యువతి యువకులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించామని, వారిలో 200 మంది ప్లేస్మెంట్ ద్వారా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించామని ఆయన అన్నారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణ పొందగోరు వారు 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గలవారై, కనీసం 5వ తరగతి నుండి డిగ్రీ చదివిన వారు ఎవరైనా నిరుద్యోగ యువతి, యువకులు అర్హులని అన్నారు. జిల్లాలో బోయేపల్లి గేటు వద్ద ఉన్న ‘నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్’ (చీూజ) యూత్ శిక్షణ కేంద్రం లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, అత్యాధునిక ల్యాబులు, పరికరాలు ఉన్నాయని అన్నారు. ఈ



సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని, తద్వారా స్వయం ఉపాధి పొంది మంచి జీవనోపాధి సాధించవచ్చని అన్నారు.

కార్యక్రమంలో NAC ద్వారా ఉపాధి నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సర్టిఫికెట్లలను అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ తెగల అభివృద్ధి శాఖ అధికారి ఛత్రు నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి సునీత, జిల్లా బి.సి.సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

# టిపిసిసి సాంస్కృతిక సేనకు కార్యాలయ భవనం కావాలి

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటికి వినతిపత్రం**

**25 ఏళ్లుగా కాంగ్రెస్ జెండాను మోస్తున్న సాంస్కృతిక సేన**

**కళాకారులకు స్థిర వేదిక లేక ఇబ్బందులు**

**సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పార్టీ భావజాలం ప్రచారం**

**టిపిసిసి సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్**



**నాగారం, అక్షిత న్యూస్:** తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలో రాజకీయ సాంస్కృతిక రంగాలకు ప్రాధాన్యత కలిగిన కీలక కార్యక్రమం దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రివర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ను మర్యాదపూర్వకగా కలిసి టీపీసీసీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర అనుదీప్ కుమార్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకపోయినా ఎలాంటి పరిస్థితుల్లోనూ పార్టీ జెండాను మోస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఉత్తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సాంస్కృతిక సేన కార్యకర్తలు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిరంతరం కృషి చేస్తూ కళాకారులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సామాజిక అవగాహన కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కానీ ఈ క్రమంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాకారులు సాధన చేయడానికి సరైన స్థలం లేకపోవడం సమావేశాలు నిర్వహించడానికి తగిన వసతులు లేకపోవడం వల్ల కార్యకలాపాలు పరిమితమవుతున్నాయని తెలిపారు. ఎంతోమంది ప్రభావంతులైన కళాకారులు ఉన్నప్పటికీ వారికి ఒక స్థిరమైన వేదిక లేకపోవడం బాధాకరమని అన్నారు. సాంస్కృతిక రంగం ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం సులభం అవుతుందని కళాకారులు సమాజంలో మార్పుకు దారితీసే శక్తిగా నిలుస్తారని తెలిపారు. సాంస్కృతిక రంగం ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం సులభం అవుతుందని కళాకారులు సమాజంలో మార్పుకు దారితీసే శక్తిగా నిలుస్తారని అన్నారు. అందువల్ల బొక్కలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో గాని తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గాని టీపిసిసి సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా కమిటీకి ఒక నూతన కార్యాలయ భవనం ఏర్పాటు చేయడం అత్యవసరమని స్పష్టం చేశారు. కార్యాలయం ఏర్పాటు అయితే కళాకారులకు సాధన కోసం స్థలం లభించడమే కాకుండా యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి సాంస్కృతిక కార్యకలాపాలను విస్తరించడానికి పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అలాగే మహిళా కళాకారులు యువత పెద్ద ఎత్తున పాల్గొని అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఇకపై కూడా కాంగ్రెస్ పార్టీ పట్ల అదే నిబద్ధతతో పనిచేస్తామని పార్టీ బలోపేతం కోసం సాంస్కృతిక సేన ద్వారా మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తమ వినతిని పరిగణలోకి తీసుకొని కార్యాలయ భవనం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎర్ర రాధిక మరియు తుంగతుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం

**పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**పలువురు అధికారులు**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** జిల్లాస్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధ్యక్షతన శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రెవెన్యూ రవాణా పోలీసు మైనింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా ఇసుక రీచ్ లను తరచూ తనిఖీ చేయాలని పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇసుక స్టాక్ యార్డులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని

సూచించారు. ఇసుక సరఫరా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లారీల్లో ఇసుకను నింపాలనీ, అధికారులు నిబంధనలు కచ్చితంగా





పాటించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిరంతరం ప్రత్యేక నిఘా పెడుతున్నామని వెల్లడించారు. ఇసుక తరలిస్తున్న లారీలను చెక్ పోస్టల పోలీస్ శాఖ సిబ్బంది ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అంశంలో 400 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద టీజీ ఎండిసి అధికా రులు ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చి తంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిష నల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు, మైనింగ్ శాఖ ఏడి రాఘవరెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి టీజీఎండిసి పీవో శ్రీనివాస్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి

**కూకట్‌పల్లి, అక్షిత ప్రతినిధి:**

అల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వరా నగర్ డివిజన్ ప్రగతి నగర్ కాలనీ లో ఎంటమాలజీ టీం దోమల నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమము నిర్వహించారు. శుక్రవారం ప్రగతి నగర్ అధ్యక్షులు తిరుపతి రావు కలిసి డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి,ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమీషనర్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డే అనగా ప్రతి శుక్రవారం మన ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తొలగించుకోవాలి మరియు టెర్రస్ పైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు,అనంతరం వార్డ్ ఎంటమాలజీ సూపర్వైజర్ నరేష్ మాట్లాడుతూ వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమలను లార్వా దశలోనే నివారించి దోమల ద్వారా వచ్చే డెంగ్యూ మరియు మలేరియా వంటి వ్యాధులను అరికట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తిరుపతిరావు, ఉపాధ్యక్షులు, బాబురావు, కాలనీ కోశాధికారి,శివాల రాము, సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ,ప్రేమ రాజ్, కనకా రెడ్డి,ముత్తయ్య,సత్తయ్య, అమరేందర్ రెడ్డి,నరసింహులు, లీలా బాయ్,రవి,మల్లేష్,కమల్ హాసన్,సంతోష్ నాయుడు, మరియు కాలనీవాసులు ఏంటోమలజీ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# హైకోర్టు తీర్పు హర్షనీయం

**బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం**

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు హైకోర్టులో ఊరట లభించడం హర్షనీయమని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అయిందని, తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో



బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, ఎల్లంకి సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, ఇడం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్‌బాబు, పున్న వెంకటేశం, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, ఎస్కే చాంద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల, అక్షితబ్యూరో:**

జగిత్యాల-కరీంనగర్ రోడ్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వాణి శ్రీనివాస్,

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హన్మంతరావు, కౌన్సిలర్ జుంబర్తి గంగాలక్ష్మీ, రాజ్ కుమార్, కూసరి అనిల్, చందాపృథ్వీ, రామకృష్ణారెడ్డి, ఆరిఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

శనివారం । 25 । ఏప్రిల్ । 2026



# బడి బస్సులు భద్రంగా ఉంచండి

### జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు

### విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం.

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బడి బస్సులను పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి జే.ఎన్. శ్రీనివాసరావు సూచించారు.

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (టిఆర్ ఎస్ ఎం ఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే ముందు, మే 15వ తేదీ తర్వాత బడి బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈలోగా అన్ని వాహనాలకు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి, రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా ఉంచాలని యాజమాన్యాలకు సూచించారు. బ్రేకులు, టైర్లు, లైట్లు వంటి భద్రతా ప్రమాణాలు సరిగా లేని బస్సులను నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని, వారి పనితీరుపై యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ ఎం ఎ (ట్రస్మా)జిల్లా నాయకులు గుర్రం కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఎలిశెట్టి నాసరయ్య తదితరులు, జిల్లాలోని వివిధ డివిజన్ల ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారిని ఘనంగాసత్కరించారు.

## వెలిదండ పాఠశాల అభివృద్ధికి విరాళాల వెల్లువ

### తొలిరోజే గ్రామస్తుల అపూర్వ స్పందన

**గరిడేపల్లి, అక్షిత ప్రతినిధి:** మన ఊరి బడిని భావితరాలకు జ్ఞాన దేవాలయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామస్తులు అద్భుతమైన ఐకమత్యాన్ని చాటుతున్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో అత్యాధునిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న "సాంస్కృతిక మేళా" నిధుల సేకరణ కార్యక్రమానికి మొదటి రోజే అనూహ్య స్పందన లభించింది. గ్రామంలోని ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, తమ ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమంది పేరిట టిక్కెట్లు కొనుగోలు చేస్తూ విరాళాలు అందజేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు యువత ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహాయం



అందించడం విశేషం. గ్రామమంతా ఏకతాటిపైకి వచ్చి చూపిస్తున్న ఈ చొరవపై పాఠశాల కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల చదువుల కోసం, ఊరి బడి అభివృద్ధి కోసం వెలిదండ గ్రామస్తులు చూపుతున్న ఈ ఉదారత ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

## కార్మికుల ప్రాణాలు బలితీసుకోవడమేనా

# రేవంత్ రెడ్డి ప్రజాపాలన అంటే?

### కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకోవద్దు.. మీకు అండగా బీజేపీ ఉంటుంది : రవికుమార్ యాదవ్

**మియాపూర్ అక్షిత ప్రతినిధి:** ఆర్.టి.సి కార్మికుల సమ్మెలో భాగంగా నర్సంపేట లో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదాన మృతికి నివాళులు అర్పిస్తూ...మౌన ప్రదర్శన చేస్తున్న మియపూర్ ఆర్.టి.సి కార్మికుల కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవికుమార్ యాదవ్ హాజరై శంకర్ గౌడ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ టి సి కార్మికులను మోసం చేశాయి అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి మోసం చేసింది అని, ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి సరూర్ నగర్ కార్మికుల సభలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి, మ్యానిఫెస్టోలో పొందుపరచి అధికారం లోకి వచ్చి ఇప్పుడు ఆర్టిసిని విలీనం చేయడంలోనూ, కార్మికుల సమస్యలు పరిస్కరించడం లోను నిర్లక్షవైఖరి అవలంబిస్తోంది అని విమర్శించారు.

కాంగ్రెస్ అధికారం లోకి రావడానికి ముఖ్య కారణమైన ఫ్రీ బస్ పథకాన్ని ఎంతో క్రమశిక్షణతో, అంకితభావంతో పని చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల 55 రోజులు సమ్మె చేస్తే ఆనాడు మేము మద్ధతు తెలిపి అండగా ఉన్నామన్నారు. ఇప్పుడు మీరు చేసే సమ్మెకు బీజేపీ అండగా ఉంటుందని శంకర్ గౌడ్ ఆత్మబలిదానం సంఘటన నన్ను చాలా కలచివేసింది అని ఇది చాలా బాధాకరం. ఆర్టీసీ కార్మికుల ప్రాణాలు బలి తీసుకోవడమేనా ప్రజాపాలన అంటే అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏ కార్మికుల క్షణకావేశంలో ఎవరూ ఆత్మ బలిదానాలకు పాల్పడొద్దని ఆర్టీసీ కార్మికులు కోరారు. సహనంతో శాంతి యుతంగా పోరాటం సాగించి



మన సమస్యలు మనంసాధించుకుందాం వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల లక్ష్మణ్, గణేష్ ముదిరాజ్, పట్టాభిరామ్, పత్తి బసవ శివ, జితేందర్, శ్రీధర్ గౌడ్ ,రవి గౌడ్, శ్రీనివాస్ చారి, సీతారామరాజు, భరత్ కుమార్ ,రాము ,మన్యం యాదవ్, శ్రీనివాస్, మొదలగు వారు పాల్గొన్నారు.

### కోళ్ల బాల కిష్టమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన

## కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**

పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోళ్ల యేసయ్య తల్లి రాత్రి అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకొని నేడు గ్రామంలోని వారి నివాసం దగ్గర, పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుమారుడు కోళ్ల యేసయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన కొల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ ఈ సందర్భంగా వారితోపాటు గోపాలకృష్ణ నాయుడు, తాళ్లకృష్ణ రాముడు కల్వకోల్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# కాళేశ్వరంపై కోర్టు తీర్పు

# కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది

**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఘోష్ కమిషన్ నివేదిక ఒక తప్పుడు తడక లాంటిది మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాజీ మంత్రి హరీష్ రావు మీద ఎటువంటి చర్యలు తీసుకోవద్దని తీర్పునిచ్చింది ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది కెసిఆర్ హరీష్ రావు పైన వచ్చిన ఆరోపణలు నిరాధారణమైనవి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రైతాంగానికి లక్షల ఎకరాలకు నీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేసింది మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్



చొరువుతో వెనుకబడ్డ తుంగతుర్తి నియోజకవర్గం కూడా పచ్చటి మాగానిగా మారింది కావున కాంగ్రెస్ ఏర్పరిచిన పిసి గోష్ కమిషన్ నివేదిక చెత్తబుట్టలో కాగితంగా మారింది.

ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అసమర్ధ పాలనకు నిదర్శనంగా మారిందని తిరుమలగిరి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సంకపల్లి రఘునందన్ రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్, జిల్లా నాయకులు దూపటి రవీందర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు మోడపు సురేందర్, కౌన్సిలర్లు కందుకూరి గీతా బాబు, కారుపోతుల సోమలక్ష్మినరేష్, పత్తేపురం త్రిశూల్, యాకూబ్ నాయక్, పనికిరా లక్ష్మీ యాదగిరి, ఎస్టీ సెల్ అధ్యక్షులు యాకుబ్ నాయక్, సర్పంచులు బర్ల వెంకన్న, బొడ్డు సైదులు, జాటోత్ రవి, కందుకూరి ప్రవీణ్, మోడపు వీరన్న, మహమ్మద్ జావిద్, అలీ, మధు చారి, పోతురాజు మల్లేష్, సురేష్ గౌడ్, ఎర్ర గణేష్, దూలం సోమయ్య, ఏల శీను తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

**సిపిఎం డిమాండ్**

**సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలిక పోగు సర్వేశ్వరరావు**

**కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా మిల్లుల కేటాయింపులో ఆలస్యం - రైతుల్లో ఆందోళన**

**15 రోజులు గడిచినా మిల్లుల అలాట్మెంట్ లేకపోవడం**

**20 రోజులుగా కేంద్రాల వద్దే ధాన్యం నిల్వ**

**ఎం.ఎస్.పి ప్రకారం తక్షణ కొనుగోలు చేయాలని డిమాండ్**



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలిగపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నేటికీ 15 రోజులు గడిచినా మిల్లులు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం తగదని అన్నారు.ఇప్పటికే కొను గోలు కేంద్రాల వద్దకు ధాన్యం పోసి దాదాపు 20 రోజులు గడిచిందని, గింజలు పూర్తిగా ఎండిపోయి 12 శాతాలకు వచ్చినప్పటికీ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు.రైతులు ఇప్పటికే పంటను కోయడంతో మార్కెట్లో నిల్వ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# ఖమ్మం జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీని వెంటనే ప్రకటించాలి

**అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటే షన్ కార్డులు మంజూరు చేయాలి**

**తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. నాగ స్వామి**



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కమిటీని తక్షణమే ప్రకటించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి. నాగ స్వామి ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

శుక్రవారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు పూర్తి కావడంతో పాటు తొలి సమావేశాలు కూడా పూర్తయిన ఖమ్మం జిల్లాలో మాత్రం ఇప్పటికీ కమిటీ ప్రకటించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని కమిటీ ఆలస్యంతో జర్నలిస్టులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.జర్నలిస్టుల హక్కులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రిడిటేషన్ కమిటీని ప్రకటించి కార్డుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

ఖమ్మం జిల్లాలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం తగదని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని జి. నాగ స్వామి స్పష్టం చేశారు.

# సత్తుపల్లిలో 3వ రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె

**ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ మృతికి సంఘీభావంగా మౌన ప్రదర్శన**

**ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**

**మద్దతుగా పాల్గొన్న పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు**

**వేసవి వేడికి స్పృహ తప్పి పడిపోయిన మహిళా కండక్టర్ వెంటనే ప్రాథమిక చికిత్సకు తరలింపు**



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి ఆర్టీసీ జెఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె కార్యా చరణలో భాగంగాశుక్రవారం రోజు సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ అమర వీరుడు నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ మౌనం పాటించారు ఆర్టీసీ కార్మికులు.అనంతరం డ్రైవర్ శంకర్ గౌడ్‌కు సంఘీభావం గా సత్తుపల్లి ఆర్టీసీ డిపో సిబ్బందితో సత్తుపల్లి పట్టణంలో బస్టాండ్ సెంటర్ నుండి పాత సెంటర్ వరకు మౌనంగా రోడ్ ప్రదర్శన (ర్యాలీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ ఎస్. సిపియం,సిపిఐ అనుబంధ పార్టీ లు, బీజేపీ, జనసేన మరియు టీడీపీ పార్టీ పార్టీనిధులు డిపోలో సమ్మెకి మద్దతుగా వచ్చి సంఘీభావం తెలపడం జరిగింది. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు సత్తుపల్లి ఆర్టీసీ డిపో జెఏసి ని కలిసి సమ్మె కి మద్దతు ఇస్తూ సమ్మె గురించి కార్మికుల హక్కుల గురించి మాట్లాడటం జరిగింది.

**ఎండకు తాళలేక సొమ్మసిల్లి పడిపోయిన మహిళా కండక్టర్**

ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ మృతికి సత్తుపల్లి పట్టణంలో ఆర్టీసీ కార్మికులు మౌన ప్రదర్శన చేపట్టడం జరిగింది ఐతే ఎం జానకి అనే మహిళా కండక్టర్ ఎండకు తాళలేక స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే అప్రమత్తమైన ఆర్టీసీ కార్మికులు ఆమెకు ప్రాథమిక చికిత్స కోసం తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.మల్లికార్జున్, బి.రాంబాబు, కె.ఎస్.రావు, జి.సతీష్, పి.రాఘవులు, యూవ్. దొర బాబు, డి.కృష్ణ, డి.ఎం.కె.రావు, యం.ముత్యయ్య, యంయన్. భూషణం, యం. జానకి, యూవ్. యన్‌కుమార్, యస్. యన్ రావు, యూవ్. ఆర్ పి. రావు, డి. యాదగిరి, టిఎస్. రావు,సిపియం,బిఆర్ ఎస్, టిటిడిపి సిపిఐ జనసేన బిజెపి నాయకులు,పలు స్వచ్ఛందసంస్థలు, ఉద్యోగ సంఘాలు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, డివిజన్ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్తుపల్లి అధ్యక్షుడు వైకుంఠరావు, శర్మ, రమేష్ ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు...

## ఆర్టీసీ కార్మిక సంఘాలు చేస్తున్నఆందోళనలకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంఘీభావం

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం ఆర్టీసీ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనలకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంఘీభావాన్ని మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య టి వేణు మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ఎన్నికల ముందు ఇచ్చిన



హామీలను నిలబెట్టుకోవాలని అదేవిధంగా కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు వాహనాలను ప్రోత్సహించడం అంటే భవిష్యత్తులో ఉచిత ప్రజా రవాణా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టి వేయడమే అని కార్మికుల జీతభత్యాల సమస్య అదే విధంగా వారు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని లేనిచో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కూడా కార్మికుల వెంట ఉండి ఆందోళనలో పాలుపంచుకుంటుందని తెలిపారు. రవాణా సౌకర్యం లేక ప్రజల నివార్యంగా ప్రైవేటు వాహనాలను ఉపయోగించడం వలన వారి భద్రత ప్రమాదంగా మారిందని అదేవిధంగా కార్మికులు ఇప్పటికే కొందరు ఆత్మహత్య చేసుకున్నారని ఒకరు మరణించిన కూడా ప్రభుత్వం చెల్లించకపోవడం భావ్యం కాదని వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## ఒంటరి వృద్ధురాలు సత్తమ్మకు 30 కేజీల బియ్యం, 2000 ఆర్థిక సహాయం

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** తిరుమలగిరి మండల పరిధిలోని మర్రి కుంట తండా గ్రామం లో ఒంటరి వృద్ధురాలు బానోతు సత్తెమ్మ ఇంట్లో కరెంట్ సర్క్యూట్ తో ఇల్లు, నిత్యవసర సరుకులు, దుస్తులు ఖాళీ బుడిదే అయ్యాయి అందుకు గ్రామ



సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్ నాయక్ ఆమెను పరామర్శించి సత్తెమ్మకు నిత్యవసరనికి 30 కేజీల బియ్యం 2000 రూపాయలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్తమ్మకు అన్ని విధాలుగా మనో ధైర్యాన్ని ఇచ్చి పరామర్శించడం జరిగింది . ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి ఇర్ఫాన్, ఉప సర్పంచ్ బానోతు సంధ్య శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు భాస్కర్ నాయక్, వార్డ్ మెంబర్లు దేవా నాయక్, యాకూబ్ నాయక్, మహిళా సంఘ బంధం అధ్యక్షురాలు బాజు, గ్రామ పెద్దలు రామ్ దాన్ నాయక్, కిషన్, రాజు,సక్కు, గ్రామ సిబ్బందులు లాలు, నిమ్మ,తదితరులు పలుగొనడం జరిగింది.